సాక్షి బాపట్ల

శనివారం । 27 । జనవరి । 2024




దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.వి. శేషసాయి శుక్రవారం దర్శించుకున్నారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000.గరిష్ట ధర రూ.4,300.మోడల్ ధర రూ.3,600 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 520.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిల్లపల్లి

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులుగా చిల్లపల్లి మోహన్‌రావును నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. చిల్లపల్లి మోహన్‌రావును బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమించారు.

ఆత్మాభిమానం నుంచే జాతీయ జెండా ఆవిర్భావం

పింగళి వెంకయ్య మనవడు జీవీఎస్ నరసింహం




పిడుగురాళ్ల: బ్రిటిష్ సామ్రాజ్యంలో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న ప్రజల ఆత్మాభిమానమే ఆత్మగా మారి ఉద్భవించిందే జాతీయ జెండా అని జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య మనవడు జీవీఎస్ నరసింహం అన్నారు. పట్టణంలోని ఏబీసీ సీబీఎస్‌సీ స్కూల్‌లో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీవీఎస్ నరసింహం హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తాతగారైన పింగళి వెంకయ్య జెండా రూపకల్పన చేయటమే కాకుండా స్వాతంత్ర్యం సమర యోధుడుగా జాతిపిత మహాత్మ గాంధీతోపాటు అనేక ప్రాంతాల్లో సంచరిస్తూ, దేశ సేవయే పరమవధిగా జీవించారని తెలిపారు. అనేక మందిలో దేశభక్తి రగిలించారన్నారు. అనంతరం పాఠశాల స్కూల్ డైరెక్టర్ జేకే అయ్యంగార్, ప్రిన్సిపాల్ రమాదేవి, శ్రీధర్ కుమార్‌లు జీవీఎస్ నరసింహంకు జ్ఞాపికను అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. అలాగే నరసింహం చేతుల మీదుగా పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్టోపస్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆక్టోపస్ కార్యాలయంలో 75వ గణతంత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ(అడ్మిన్) ఎం.నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన ఎస్పీ(ట్రైనింగ్) బి.రవిచంద్రకు ఉత్తమ సేవా పతకం, ఇన్స్‌పెక్టర్ కేవీవీ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లుకు సేవా పతకం, ఇన్స్‌పెక్టర్ ఆర్సీ నాయక్, కానిస్టేబుల్ ఎం.సూర్యనారాయణలకు డీజీపీ సిల్వర్ డిస్క్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి మస్తానయ్య ఉరుసు మహోత్సవాలు



పాత గుంటూరు : జీటీ రోడ్డులోని హజరత్ కాలే మస్తాన్ షా 132వ ఉరుసు మహోత్సవాలు ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు. దర్గాలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 28న నూతన చాందిని అలంకరణ, రాత్రి గంధం ఊరేగింపు, 29న గంధం పంపిణీ, దీపారాధన 30న ఖురాన్ పఠనం, బాబా వారి ప్రసాదం పంపిణీ 31న ఫకీర్లకు బాబా వారి శేష వస్త్రాల పంపిణీ 1న బాబా ఆశీనులైన కుర్చీని యథాస్థానంలో ఉంచనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు విశేష ప్రార్థనలు , భక్తులకుఅన్న ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో దూండీశ్వరి, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు

35 మంది ఎంపీడీఓలకు స్థానచలనం

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 35 మంది ఎంపీడీవోలను వేర్వేరు జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఏ. సూర్యకుమారి శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఒకే స్థానంలో మూడేళ్లకు పైబడి పని చేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 12 మందిని ఉమ్మడి కృష్ణా నుంచి 23 మందిని ఉమ్మడి ప్రకాశం జిల్లా జిల్లాకు బదిలీ చేశారు.



ప్రథమస్థానం సాధించిన విద్యాశాఖ శకటం



నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు శకటం



అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

సమష్టి కృషితో సమున్నతి

జిల్లాలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు

- పేదలకు 47,805 గృహాలు మంజూరు
- 6.72 లక్షల ఎకరాలకు సాగునీరు
- 75వ గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ రంజిత్‌బాషా
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జాతీయజెండా ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 75వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం జిల్లా కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యంలో భాగంగా ముఖ్యమంత్రి గ్రామ, వార్డు, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. జిల్లాలో 477 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా 4,398 మంది సచివాలయ సిబ్బందిని ప్రభుత్వం నియమించిందని, తద్వారా 536 సేవలు ఒకేచోట లభించేలా చర్యలు చేపట్టిందన్నారు. వ్యవసాయశాఖ పరిధిలో 2023–24 ఏడాదిలో 2.53 లక్షల ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు చేశామన్నారు. ఇప్పటివరకు 24,696 క్వింటాళ్ల విత్తనాలను రూ.13.7 కోట్ల రాయితీపై రైతులకు అందించామన్నారు. సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి మిషన్‌లో భాగంగా రూ.8.65 కోట్లతో కూరగాయలు, పూలతోటల పెంపకం చేపట్టామన్నారు. 2663 మంది మత్స్యకారులకు రూ 3.24 కోట్ల ఆయిల్ సబ్సిడీని ఇవ్వడం జరిగిందన్నారు. పేదలకు 47,805 గృహాలను మంజూరుచేసి నిర్మిస్తున్నామన్నారు. 77 రెవెన్యూ గ్రామాల పరిధిలో రీసర్వే జరుగుతోందన్నారు. జిల్లాలో మేజర్, మైనర్ సాగునీటి పథకాల పరిధిలో 6.72 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. 458 గ్రామాల పరిధిలో 2.56 లక్షల మందికి ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో బ్యాంకు లింకేజీ ద్వారా మహిళలకు రూ.1333.44 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. అంగన్‌వాడీల ద్వారా 46 వేలమంది చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్య సురక్ష ద్వారా 1.81లక్షల మందికి వైద్య సేవలు అందించామన్నారు. 364 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో సైతం వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

పథకాలతో సంక్షేమం..

వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ పంటల బీమా, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, నాడు–నేడులో అభివృద్ధి పనులు, జగనన్న గోరుముద్దతో పాటు పలు పథకాల ద్వారా లక్షలాదిమందికి లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. ఇవేకాకుండా జిల్లాలో పెద్దఎత్తున సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. జిల్లా అభివృద్ధికి నిత్యం పాటుపడుతున్న అధికారులకు అభినందనలు తెలిపారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్

అంబరాన్నంటిన సంబరాలు..

గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను జాతీయ జెండాలతో సుందరంగా ముస్తాబుచేశారు. వేడుకలు వీక్షించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, యువకులు, విద్యార్థులు తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జాతీయభావం స్ఫూర్తిగా పలు గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శనలు, వివిధ కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం జిల్లా కలెక్టర్ వివిధ రంగాల్లో ప్రతిభ కనపరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన..

బాపట్ల అర్బన్: గణతంత్ర వేడుకల్లో నిర్వహించిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. దిశ యాప్ పనితీరుపై పోలీసులు నిర్వహించిన ప్రదర్శన అందరినీ ఆలోచింపచేసింది. విద్యాశాఖ శకటం ప్రథమ బహుమతి పొందగా, వ్యవసాయ, ఉద్యానవన, ఏపీఎంఐపీ శాఖల శకటం ద్వితీయ బహుమతి, పౌరసరఫరాల శాఖ శకటం తృతీయ బహుమతిని సొంతం చేసుకుంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శకటం ప్రోత్సాహక బహుమతిని అందుకుంది. సాంస్కృతిక కార్యక్రమాల్లో సర్వాయపాలెం బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి అందుకోగా, బాపట్ల అక్బర్‌పేట ఏపీ సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు ద్వితీయ బహుమతి, బాపట్ల ఎస్ఎం కళాశాల విద్యార్థులు తృతీయ బహుమతి అందుకున్నారు. తొలుత జిల్లా కలెక్టర్ 526 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.1.05 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం వేడుకలలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి, జిల్లా సంయుక్త కలెక్టర్ సి.హెచ్. శ్రీధర్, అదనపు ఎస్పీ పి.మహేష్, ఆర్డీఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితోనే మెరుగైన సమాజం

బాపట్లటౌన్: ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తితో నడిచినప్పుడే మెరుగైన సమాజ స్థాపన సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. తొలుత జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించి, త్రివర్ణ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. పోలీస్ సిబ్బంది, అధికారులు, జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ప్రజలందరూ రాజ్యాంగ స్ఫూర్తితో నడుచుకుంటూ మెరుగైన సమాజాన్ని నిర్మించాలన్నారు. అనంతరం విద్యార్థులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, డీపీఓ అధికారులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు, చీరాల డీఎస్పీ ప్రసాద్ రావు, ఏఆర్‌డీఎస్పీ ఎండీ హెచ్ ప్రేమ్‌కుమార్, ఎస్‌బి సీఐ వి.సూర్యనారాయణ, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్‌నాయక్, హోంగార్డు ఆర్ఐ ఎల్.గోపినాథ్, డీపీఓ అధికారులు, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శం

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



జాతీయ జెండా ఆవిష్కరించి, గౌరవ వందనం చేస్తున్న మంత్రి రజిని

పట్నంబజారు: భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే ఆదర్శమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. మంత్రి రజిని మువ్వెన్నల పతాన్ని ఆవిష్కరించి, అక్కడే ఉన్న చిన్నారులతో సరదాగా కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాలే నేటి స్వేచ్ఛావాయువులని తెలిపారు. 1950వ సంవత్సరంలో మన రాజ్యాంగం అమలులోకి వచ్చిందని, ఆనాటి నుంచి నేటి వరకు మన దేశం అభివృద్ధి పథంలో సాగిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో గణనీయమైన మార్పులు సాధించగలిగామన్నారు. పేదరిక నిర్మూలన, సామాజిక సమానత్వం ద్వారానే మనం రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడిన వాళ్లం అవుతామని స్పష్టం చేశారు. పేదలు తలెత్తుకుని తిరిగిన రోజు అమరవీరుల ప్రాణ త్యాగాలకు నిజమైన ఫలితం దక్కినట్లు అవుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలంతో, దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్తున్నారన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రతి అడుగు వేస్తూ.. పేదలకు నేనున్నానే భరోసాని కల్పించారన్నారు. సామాజిక న్యాయసాధన దిశగా విజయవతంగా ముందుకెళుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్లు, సచివాలయాల కన్వీనర్‌లు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కూలిన బతుకులు..!

- పొట్టకూటికి వెళ్లి.. ప్రాణాలు వదిలి..
- ఆర్టీసీ బస్సును ఢీకొన్న కూలీలతో వెళ్తున్న ఆటో
- ఒకే ఊరికి చెందిన ముగ్గురు మృత్యువాత
- ఒకరి పరిస్థితి విషమం.. 12 మందికి గాయాలు
- శోకసంద్రంగా వేలూరు గ్రామం



చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద విలపిస్తున్న మృతుల బంధువులు





మృతులు శివపార్వతి, హనుమాయమ్మ (ఫైల్)

చిలకలూరిపేట, యడ్లపాడు: వారంతా వ్యవసాయ కూలీలు...రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదలు. రోజుమాదిరిగానే ఉదయాన్నే కూలి పనులకు ఆటోలో బయలుదేరారు. కొద్దిసేపట్లోనే మృత్యువు వారిలోని ముగ్గురిని తన ఒడిలోకి చేర్చుకోగా.. మరో 13 మంది ఆస్పత్రి పాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన 16 మంది వ్యవసాయ కూలీలు గ్రామం నుంచి ఆటోలో మిర్చి కోతల నిమిత్తం నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామానికి శుక్రవారం బయలుదేరారు. ఆటో మార్గమధ్యంలోని గణపవరం డొంకనుంచి లింగంగుంట్ల గ్రామం వద్ద నరసరావుపేట రహదారిలోకి ప్రవేశిస్తోంది... సరిగ్గా అదే సమయంలో చిలకలూరిపేట వైపునకు ఆర్టీసీ బస్సు వస్తున్న క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ఆటోపైకి ఎక్కడంతో కూలీలంతా ఆటోలో చిక్కుకుపోయి హాహాకారాలు చేశారు. ఇది గమనించిన స్థానికులు పరుగున వచ్చి బస్సులోని జనాన్ని కిందకు దించి, ఆటోపై నుంచి బస్సును పక్కకు తొలగించారు. ఈ ఘటనలో ఆటోలో డ్రైవర్ పక్కనే కూర్చున్న ఏకసిరి హనుమాయమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన వారిని 108 వాహనం సహాయంతో చిలకలూరిపేట ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇందులో గన్నవరపు శివపార్వతి(60) చికిత్స పొందుతూ మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన షేక్ హజరత్‌వలి, సరుగుల కోటేశ్వరమ్మలను గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ హజరత్‌వలి (60) కన్నుమూశాడు. కోటేశ్వరమ్మ పరిస్థితి విషమంగా ఉంది. కాగా ఆటో డ్రైవర్ షేక్ సుభానితో పాటు గాయపడిన పాలెపు రజిని, ఎస్.పార్వతి, షేక్ వలిమా, బేతంచర్ల మల్లేశ్వరి, పాలెపు శారద, షేక్ జాన్‌బీ, షేక్ ఖాదర్‌బీ, షేక్ మహబూబ్‌బీ, షేక్ మస్తాన్‌బీ, గోరంట్ల శివకుమారి, షేక్ బాజీలకు చికిత్స అందిస్తున్నారు. బాధితులంతా వేలూరు గ్రామానికే చెందిన వారు కావడంతో ఆ గ్రామస్తులతో ప్రభుత్వాసుపత్రి ప్రాంగణం నిండిపోయింది. మృతుల బంధువుల రోదనలతో విషాదఛాయలు అలు ముకున్నాయి. చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సహృదయత చాటుకున్న మల్లెల...

సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆస్పత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. మృతి చెందిన కుటుంబాలకు తన వ్యక్తిగతంగా ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వసాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఒక్కొక్కరిదీ ఓ విషాద గాథ...

- శివపార్వతికి ముగ్గురు కుమార్తెలు. ముగ్గురికీ వివాహాలు అయ్యాయి. భర్త నాలుగేళ్ల కిందట కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. ఒక్కదానినే అన్న బాధను దిగమింగుకుని కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంది. సంక్రాంతి పండుగకు కుమార్తెలు రాకపోవడంతో దిగులుగా ఫోన్లు చేయడంతో గత ఆదివారం నాడు వచ్చి అంతా అమ్మను పలకరించారు. ఆరోజు తల్లి తమపై చూపించిన ఆప్యాయతే చివరిదని గ్రహించలేకపోయామంటూ కుమార్తెలు తలుచుకుంటూ కన్నీళ్ల పర్యంతమయ్యారు. గాయాలతో ఆస్పత్రికి వచ్చాకా కడసారి చూస్తూనే కన్నుమూసిందయ్యా అంటూ రోదించారు.
- ఏకసిరి హనుమాయమ్మకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. అందరికీ వివాహాలు జరిగినా అంతా కలిసే ఉంటారు. అందరికీ ఒకటే కట్టు, ఒకటే మాట. అందరూ పనులకు వెళ్లొద్దన్నా.. ఊరికే కూర్చుంటే ఏమోస్తుంది నలుగురితో కలిసినట్టు ఉంటుంది. వచ్చే కూలి కుటుంబానికి కొంత చేదోడు వాదోడుగా ఉంటుందంటూ కొద్దికాలంగా గ్రామస్తులతో కలిసి మిరప కోతలకు వెళ్తుంది. ఇంటి పెద్దదిక్కు దూరమైందని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.
- మృతుడు షేక్ హజరత్‌వలి, సాబిరా దంపతులకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తాపీపనులు చేస్తూనే అందరికీ వివాహాలు చేశాడు. ఎవరి కుటుంబాలు వారివి అయ్యాయి. ప్రస్తుతం ఆయనకు భార్య పని చేసే పరిస్థితి లేదు. తనకు 70 ఏళ్లు రావడంతో తాపీ పనులు చేయలేక వ్యవసాయ పనులకు వెళ్తూ భార్యను పోషించుకుంటున్నాడు. కొద్దికాలం కిందట కొడుకు, ఇప్పుడు భర్త చనిపోవడంతో సాబిరా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ముగ్గురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ

- ఒంగోలు కమిషనర్ వైఎస్సార్ కడప జిల్లా తాడిగడపకు..
- తెనాలి నుంచి ఒంగోలు వస్తున్న ఎం.జస్వంత్ రావు
- చీమకుర్తి, గిద్దలూరు కమిషనర్లు కూడా...

ఒంగోలు సబర్బన్: జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీఓఆర్టీ నంబర్–105ను విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 92 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రానున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారిని బదిలీ చేశారు. అందులో భాగంగా ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావును వైఎస్సార్ కడప జిల్లా తాడిగడప మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఒంగోలు కమిషనర్‌గా గుంటూరు జిల్లా తెనాలి కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.జస్వంత్ రావును నియమించారు. గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేస్తున్న వై.రామకృష్ణయ్యను వైఎస్సార్ కడప జిల్లా యర్రగుంట్లకు బదిలీ చేశారు. గిద్దలూరుకు తిరుపతి జిల్లా నాయుడు పేట కమిషనర్‌గా పనిచేస్తున్న వి.శ్రీనివాసరావును కేటాయించారు. చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాను నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు బదిలీ చేశారు. చీమకుర్తికి నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో పనిచేస్తున్న ఎస్.ఈశ్వర రాజును బదిలీ చేశారు. అదేవిధంగా ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో సెక్రటరీగా పనిచేస్తున్న ఎం.శ్రీలక్ష్మిని బదిలీ చేశారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఏఓగా పనిచేస్తున్న ఎం.అంజయ్యను బదిలీ చేశారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు


జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న బాపట్ల ఆర్డీవో పి .వెంకటరమణ

జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 75వ గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకే కలెక్టర్ రంజిత్ బాషా జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనపరిచిన అధికారులకు ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. – బాపట్ల టౌన్/ అర్బన్


డ్వామా పీడీ బొంత అర్జున్ | డీఆర్‌డీఏ పీడీ చొప్పర కృష్ణ | మైన్స్ అండ్ జియాలజీ ఆఫీసర్ ఆర్. రాజేష్ కుమార్ | ఇమ్యునైజేషన్ ఆఫీసర్ టి. వెంకటేశ్వరరావు | కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గోపాలకృష్ణ | ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వి. రమణ | ఏపీ మార్క్ఫెడ్ డీఎం కె.కరుణశ్రీ | డీసీహెచ్‌ఎస్ ఎ.వి. శేష కుమార్ | చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జి. భరత్ కుమార్ | పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఆఫీసర్ ఆర్.వి. శ్రీనివాసరావు | సహకార అధికారి కె.వి.రామారావు


చీరాల డీఎస్పీ ప్రసాదరావు | అగ్రికల్చరల్ డీడీఎం విజయనిర్మల | క్రీడా ప్రాధికార సంస్థ అధికారి కె. పాల్ కుమార్ | ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్. విద్యాసాగర్ | ఆర్ అండ్ బీ ఎస్ఈ వి. శ్రీనివాసరావు


పంచాయతీ రాజ్ ఎస్ఈ జె.హరే రామరాజు | సీపీడీసీఎల్ ఎస్ఈ బి.హరి ప్రసాదరావు | లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కె. శివకృష్ణ | భూ విభాగం సూపరింటెండెంట్ సీతారత్నం | ఎలక్షన్ సెల్ అధికారి కృష్ణ కాంత్ | బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ తూమాటి రాజారావు | డీఆర్‌డీఏ ఏపీఎం డి. సురేష్ | సైన్స్ అధికారి ఎండీ. సాదిక్ | ఐ అండ్ పీఆర్ ఫొటోగ్రాఫర్ సతీష్ | విద్యాశాఖ అధికారి పి. వి. జె. రామారావు | చీరాల మున్సిపల్ కమిషనర్ కె. రామచంద్రారెడ్డి | రేపల్లె మున్సిపల్ కమిషనర్ విజయ సారథి | వ్యవసాయ అధికారి ఎస్ హెచ్. అబ్దుల్ సత్తార్ | బాపట్ల డీఎస్పీ టి. వెంకటేశులు

క్లుప్తంగా

డీఆర్ఎం కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం


కవాతు చేస్తూ జాతీయ జెండాకు వందనం చేస్తున్న రైల్వే పోలీసులు

లక్ష్మీపురం: నేడు దేశంలో స్వేచ్ఛాయుత జీవితాన్ని గడుపుతున్నామంటే దానికి కారణం అమర వీరుల త్యాగఫలం అని, ప్రతి గణతంత్ర దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో జరుపుకోవడం అనవాయితీగా వస్తుందని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. నల్లపాడులోని రైల్వే పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా డీఆర్ఎం రామకృష్ణ డివిజన్ సిబ్బంది, రైల్వే ఆర్పీఎఫ్, జీఆర్పీ, ఐఆర్పీ సిబ్బంది సమక్షంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరుల అడుగు జాడల్లో నడుచుకోవాల్సిందిగా సూచించారు. అదే విధంగా ఈ రోజు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంటూరు రైల్వే డివిజన్ మరింత అభివృద్ధి పథంలో నడిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శునకాల ప్రదర్శన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఆర్. శ్రీనివాస్, సైమన్, ఆయా విభాగాధిపతులు డివిజన్ సిబ్బంది, డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్, ఆర్పీఎఫ్, జీఆర్పీ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ద్వితీయ స్థానంలో నిలిచిన వ్యవసాయశాఖ శకటం


తృతీయ స్థానంలో నిలిచిన పౌరసరఫరాల శాఖ శకటం

అలరించిన శకటాల ప్రదర్శన

బాపట్ల టౌన్: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బాపట్ల జిల్లాలో జరిగిన అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపిస్తూ సాగిన శకటాల ప్రదర్శన చూపరుల్ని విశేషంగా ఆకట్టుకుంది. శాఖల వారీగా ప్రభుత్వం ఏ మేరకు అభివృద్ధి చేసిందో క్షుణ్ణంగా వివరిస్తూ శకటాల ప్రదర్శన సాగింది. మొదటి స్థానంలో విద్యాశాఖ నాడు–నేడు శకటం, ద్వితీయ స్థానంలో వ్యవసాయ శాఖ శకటం, మూడో స్థానంలో పౌరసరఫరాల శాఖ శకటాలు నిలిచాయి. ప్రోత్సాహక బహుమతి శకటంగా జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ శకటం నిలిచింది. వీటితో పాటు నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు, వైఎస్సార్ క్రాంతిపథం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పశుసంవర్ధక, మత్స్యశాఖ, అగ్నిమాపక శాఖల శకటాలు అభివృద్ధిని క్షుణ్ణంగా వివరించాయి.


ప్రోత్సాహక బహుమతి అందుకున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ శకటం

జగనన్న పాలనలో ప్రతి ఇంటా ఆనందం

సమన్వయకర్త చిన హనిమిరెడ్డి


ప్రజలకు అభివాదం చేస్తున్న చిన హనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ప్రజా రంజక పాలన అందిస్తున్న సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటా ఆనందంగా ఉన్నారని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. 'పల్లెపల్లెకు చిన హనిమిరెడ్డి' కార్యక్రమాన్ని మండలంలోని మిన్నెకల్లులో శుక్రవారం నిర్వహించారు. గ్రామస్తులు హనిమిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెప్పిన మాటలే కాకుండా చెప్పని పథకాలు కూడా అమలు చేసిన ఏకైక సీఎం మన జగనన్న అని పేర్కొన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ప్రతిపక్షాలు రోజుకో మాట.. పూటకో ప్రకటనలు, తప్పుడు హామీలతో వస్తారని, వాటిని నమ్మవద్దని తెలిపారు. ప్రతిపక్షాలది కేవలం పేపర్ల మీదే వారి అభివృద్ధి అని ఎద్దేవా చేశారు. జగనన్న పాలనలో కులమతాలు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ ద్వారా పెన్షన్ అందడంతో అవ్వాతాతల ఆనందానికి అవధులులేవని తెలిపారు. సచివాలయం, రైతుభరోసా కేంద్రాల ద్వారా ఇంటి వద్దకే రైతులకు ప్రజలకు సేవలు అందుతున్నాయని చెప్పారు. జగనన్న ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని వివరించారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండాలని కోరారు. అద్దంకి సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తనను కుటుంబ సభ్యుడిగా భావించి ప్రజలు ఆదరిస్తున్నారన్నారని సంతోషం వ్యక్తం చేశారు. అద్దంకిలో వైఎస్సార్ సీపీని గెలిపించుకుని జగనన్నకు బహుమతిగా అందించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, మార్కెట్ యార్డు చైర్మన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీర జవాన్ మురళీకృష్ణకు గ్యాలంటరీ మెడల్


మురళీకృష్ణ తల్లిదండ్రులకు గ్యాలంటరీ మెడల్ కాపీని అందిస్తున్న ఆర్కే పాండా

సత్తెనపల్లి: ఛత్తీస్‌గఢ్ వద్ద కోబ్రా–210 విభాగంలో విధులు నిర్వహిస్తూ 2021 ఏప్రిల్ 3న మావోయిస్టుల ఘాతుకానికి పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ శాఖమూరి మురళీకృష్ణ వీర మరణం పొందిన విషయం తెలిసిందే. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన గ్యాలంటరీ మెడల్‌కు ఎంపికయ్యారు. ఈ మెడల్ కాపీని సీఆర్పీఎఫ్ కమాండెంట్ ఆర్కే పాండా శుక్రవారం సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో ఉన్న శాఖమూరి మురళీకృష్ణ ఇంటికి వచ్చి మృతుడి తల్లి విజయకుమారికి అందించారు. ముందుగా గ్రామంలో ఏర్పాటు చేసిన శాఖమూరి మురళీకృష్ణ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమాండెంట్ ఎస్.పి.రజిత, సీఆర్పీఎఫ్ సిబ్బంది, సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ పైడి రాంబాబు, సిబ్బంది, మురళీకృష్ణ తండ్రి రవీంద్రబాబు, సోదరుడు వెంకట మోహన్ రావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న స్ఫూర్తితో బజరంగ్ సేవ

- ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- చేబ్రోలులో రెండవ రోజు 1121 మందికి నేత్ర, గుండె వైద్య పరీక్షలు


వైద్య శిబిరానికి వచ్చిన చేబ్రోలు గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ ఫలాల స్ఫూర్తిగా బజరంగ్ ఫౌండేషన్ జగన్నామ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు హైస్కూల్ రోడ్డు సమీపంలో జీబీసీ రహదారి పక్కన జగన్నామ సంక్షేమ సంగమం శిబిరం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం 1121 మందికి పైగా కంటి, గుండె పరీక్షలు చేయించుకున్నారు. వీటితోపాటు ఫిజియోథెరిపీ సేవలను వినియోగించుకున్నారు. తొలిరోజు గురువారం 1287 మంది బజరంగ్ సేవలను వినియోగించుకున్నారు. మురళీకృష్ణ మాట్లాడుతూ యాంజియోగ్రామ్ అవసరమైన వారిని సోమవారం ఉదయం ప్రత్యేక వాహనంలో విజయవాడ తీసుకెళ్లి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఉచిత నేత్ర వైద్య పరీక్షలు అనంతరం అవసరమైన వారికి ఏడు పనిదినాల్లో కళ్లజోళ్ల పంపిణీ, మీ గుండె పదిలం కార్యక్రమంలో ఉచిత గుండె పరీక్షలు, అవసరమైన వారికి యాంజియోగ్రామ్ నిర్వహించి సమస్య ఉన్న వారికి స్టంట్స్, బైపాస్ సర్జరీలు చేయిస్తామని తెలిపారు. దివ్యాంగ దర్శినిలో దివ్యాంగులకు ట్రై సైకిల్స్, జైపూర్ కాలు, వెస్ట్రన్ కమోడ్‌లు సమకూరుస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు 87 కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.

బాపట్ల జిల్లా యువజన విభాగ కమిటీ నియామకం

బాపట్ల టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం బాపట్ల జిల్లా యువజన విభాగం నూతన కమిటీను ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా వేమూరు నియోజకవర్గానికి చెందిన ఎం.ఎస్.ఆర్. చందన్‌నాగ్‌ను నియమించారు. జనరల్ సెక్రటరీలుగా వల్లేపు శ్రీనివాసరావు (అద్దంకి), దొంతిబోయిన బ్రహ్మానందరెడ్డి (బాపట్ల), దొక్కా ప్రవీణ్ (చీరాల), కోళ్లపూడి అశోక్‌కుమార్ (వేమూరు)ను నియమించారు. సెక్రటరీలుగా వైకుంఠ రవిజేత (అద్దంకి), ఇప్పల సుబ్బారెడ్డి (అద్దంకి), బండి మహేష్ (బాపట్ల), మునగాల అయ్యప్పరెడ్డి (బాపట్ల), షేక్ రియాజ్‌బాషా (చీరాల), బొమ్మిడి వెంకటశివనాగరాజు (చీరాల), గాజుల భానుప్రకాష్ (వేమూరు), సమ్మెట భాస్కర్‌రెడ్డి (వేమూరు)ను నియమించారు. జాయింట్ సెక్రటరీలుగా జాగర్లమూడి మహేష్ (అద్దంకి), కోనంకి శ్రీనివాసరావు (అద్దంకి), పఠాన్ ఇమ్రాన్‌ఖాన్ (బాపట్ల), ఇల్లా ఏసుబాబు (బాపట్ల), చేబ్రోలు అవినాష్ (చీరాల), కావూరి బాలకోటిరెడ్డి (చీరాల), జొన్నాబుల నవీన్ (వేమూరు), పాలిమేర నవీన్‌రెడ్డి (వేమూరు)ను నియమిస్తూ పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

కోర్టు ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవం

నరసరావుపేటటౌన్: పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో గణతంత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో 13వ అదనపు జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి పి.వి.ఎస్.సూర్యనారాయణమూర్తి జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శోభారాణి, ఆశీర్వాదం పాల్, టి.ప్రవల్లిక, న్యాయవాద సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో తహసీల్దార్ రమణానాయక్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను డీఎస్పీ మహేష్ ఎగురవేశారు. అనంతరం జాతీయ జెండాకు వందనం చేశారు.

చుండూరు అమరుల స్తూప నిర్మాణానికి భూమిపూజ

చుండూరు(వేమూరు): చుండూరు ఉద్యమ వీరులను గుర్తించాల్సిన బాధ్యత ప్రతి దళితుడుపై ఉందని దళిత రాష్ట్ర మహాసభ అధ్యక్షులు మల్లెల వెంకటరావు అన్నారు. చుండూరులోని మృతి వీరుల రక్త క్షేత్రం వద్ద దళిత నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్తూప నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ 1991 ఆగస్టు 6న చుండూరులో అగ్రకులాలు వారు ఎనిమిది మంది దళితులను అమానుషంగా చంపారని గుర్తు చేశారు. మృత వీరుల జ్ఞాపకంగా 33 అడుగుల స్తూపం నిర్మించాలని చుండూరు బాధితుల పోరాట కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దళిత బాధితుల పోరాట కమిటీ అధ్యక్షులు జాలాది మోజేష్ మాట్లాడుతూ స్తూపాన్ని త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెనుకుదురుపాడు సర్పంచ్ రుద్రపాటి బుజ్జిబాబు, జిల్లా దళిత నాయకులు బేతాళ ప్రసాద్, అడ్వకేట్ మదిర నాగేశ్వరరావు, రిపబ్లిక్ పార్టీ రాష్ట్ర నాయకులు కంచర్ల జనచర్ల, నాగార్జున యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పిల్లి వాసు, రిపబ్లిక్ పార్టీ నాయకులు విప్పర్ల ముత్తయ్య, ఇండియన్ లాయర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి. సురేష్, యంత్ర పాటి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగానే జగనన్న పాలన


జెండాను ఆవిష్కరిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

పట్నంబజారు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలను అనుసరిస్తూ.. మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాలకు ఊపిరి పోస్తూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశించిన సామాజిక సాధికారతను ఆచరణలో చేసి చూపెట్టిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో తిరిగి ముఖ్యమంత్రిగా జగనన్నను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ నేతలు, పలు కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు పఠాన్ ముంతాజ్, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వై షేక్, రామకృష్ణా రెడ్డి, దాసరి జాన్‌బాబు, గనిక ఝాన్సీరాణి, బి. రోజారాణి పాల్గొన్నారు.

ఇండో-చైనా యుద్ధంలో అసువులు బాసిన సుబ్బారావు



మార్టూరు: ఇండియా, చైనా దేశాల మధ్య 1962లో జరిగిన యుద్ధంలో బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన పుట్టా సుబ్బారావు అనే సైనికుడు వీరమరణం పొందారు. స్థానిక తూర్పు బజారుకు చెందిన పుట్టా తిరుపతయ్య, పున్నమ్మ దంపతుల కుమారుడు సుబ్బారావు దేశంపై ఉన్న మమకారంతో అప్పట్లో ఆర్మీలో చేరారు. ఇండియా–చైనా దేశాల మధ్య జరిగిన భీకర యుద్ధంలో శత్రు సైనికులతో పోరాడుతూ వీర మరణం పొందినట్లు ఆయన సమీప బంధువులు, స్థానికులు తెలిపారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సుబ్బారావు దేశభక్తిని, పోరాటపటిమను, మరణవార్తను స్థానికులు శుక్రవారం గుర్తు చేసుకున్నారు. 1962లో వీరమరణం పొందిన సైనికుడు సుబ్బారావు కుటుంబ వివరాలను, ప్రస్తుతం ఆయన పూర్వీకుల నుంచి ఆర్మీ అధికారులు 62 ఏళ్ల తరువాత గణతంత్ర వేడుకల సందర్భంగా సేకరించడం గమనార్హం.